# సూర్యకు 'ఐసీసీ టీ20 ప్లేయర్'



దుబాయ్: టీమ్‌ఇండియా డాషింగ్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ మరోమారు తళుక్కుమన్నాడు. తన వైవిధ్యమైన బ్యాటింగ్‌తో పొట్టి ఫార్మాట్‌కు కొత్త హంగులు అద్దిన సూర్యకుమార్..వరుసగా రెండో ఏడాది ఐసీసీ టీ20 ప్లేయర్ ఆఫ్ ద ఇయర్ అవార్డును కైవసం చేసుకున్నాడు. టీ20ల్లో భారత మిడిలార్డర్‌కు సూర్య వెన్నెముక అని ఐసీసీ ఈ సందర్భంగా ప్రశంసలు కురిపించింది. గతేడాది 150కి పైగా స్ట్రైక్‌రేట్‌తో సూర్య..పొట్టి ఫార్మాట్‌లో దుమ్మురేపాడు. వెస్టిండీస్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, శ్రీలంక జట్లపై సూర్య అదరగొట్టిన తీరుపై ప్రశంసలు కురిపించింది. ఇదిలా ఉంటే దక్షిణాఫ్రికా సిరీస్ సందర్భంగా గాయపడ్డ ఈ డాషింగ్ బ్యాటర్ ప్రస్తుతం కోలుకుంటున్నాడు. రానున్న ఐపీఎల్ ద్వారా తిరిగి మైదానంలోకి అడుగుపెట్టే అవకాశముంది.

# బోపన్న నం.1

**డబుల్స్‌లో టాప్ ర్యాంక్‌లోకి**

**భారత టెన్నిస్ దిగ్గజం అరుదైన రికార్డు**



మెల్‌బోర్న్: భారత టెన్నిస్ దిగ్గజం రోహన్ బోపన్న అరుదైన రికార్డు సాధించాడు. వయసు కేవలం అంకె అని నిరూపిస్తూ..పురుషుల డబుల్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్ అందుకున్న ఎక్కువ(43 ఏండ్లు) వయస్సు ప్లేయర్‌గా బోపన్న రికార్డుల్లోకెక్కాడు. ఈ క్రమంలో ఇప్పటి వరకు రాజీవ్‌రామ్(38 ఏండ్లు) ఫీట్‌ను బోపన్న తిరుగరాశాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెమీఫైనల్ చేరుకోవడం ద్వారా రోహన్ ఈ రికార్డు అందుకున్నాడు. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో బోపన్న, మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ 6-4, 7-6(7/5) తేడాతో మాక్సిమో గోంజాలెజ్, అండ్రెస్ మోల్టెని(అర్జెంటీనా) ద్వయంపై గెలిచి సెమీస్ చేరింది. గతేడాది యూఎస్ ఓపెన్ ఫైనల్ చేరిన బోపన్న అత్యధిక వయసు కల్గిన ప్లేయర్‌గా నిలువగా, ఇప్పుడు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మరో అడుగుదూరంలో నిలిచాడు.

**అల్కరాజ్ ఔట్:** ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సంచలనం నమోదైంది. పురుషుల సింగిల్స్‌లో టైటిల్ ఫేవరెట్ కార్లోస్ అల్కరాజ్‌కు షాక్ తగిలింది. హోరాహోరీగా సాగిన పోరులో అలెగ్జాండర్ జ్వెరెవ్(జర్మనీ) 6-1, 6-3, 6-7(2/7), 6-4తో అల్కరాజ్‌ను ఓడించి సెమీస్‌లోకి దూసుకెళ్లాడు. మరో క్వార్టర్స్‌లో డానియెల్ మెద్వదెవ్ (రష్యా) 7-6(7/4), 2-6, 6-3, 5-7, 6-4తో హుబెర్ట్ హుర్కాజ్(పోలండ్)పై గెలిచాడు. మహిళల సింగిల్స్‌లో జెంగ్ 6-7(4/7), 6-3, 6-1తో కలిన్‌స్కేయాపై, యాస్ట్రేమెస్కా 6-3, 6-4తో నోస్కోవాపై గెలిచి సెమీస్‌లోకి ప్రవేశించారు.

## కిరణ్, లక్ష్యసేన్ ముందంజ

జకార్తా: ఇండోనేషియా మాస్టర్స్ టోర్నీలో భారత షట్లర్లు కిరణ్‌జార్జ్, లక్ష్యసేన్ ముందంజ వేయగా, కిడాంబి శ్రీకాంత్, హెచ్ఎస్ ప్రణయ్ నిష్క్రమించారు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో కిరణ్ జార్జ్ 18-21, 21-16, 21-19తో జూనియర్ పొపోవ్(ఫ్రాన్స్)పై గెలిచాడు. మరో సింగిల్స్‌లో లక్ష్యసేన్ 24-22, 21-15తో వెంగ్‌హాంగ్(చైనా)పై అలవోక విజయం సాధించాడు. మిగతా మ్యాచ్‌ల్లో ప్రణయ్ 18-21, 21-19, 10-21తో కీన్ యు చేతిలో ఓడగా, శ్రీకాంత్ 21-19, 14-21, 11-21తో లీ జీ జియాపై ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించారు.

## భారత్ X ఐర్లాండ్

**అండర్-19 ప్రపంచకప్**

బ్లూమ్‌ఫౌంటైన్: ప్రతిష్ఠాత్మక అండర్-19 ప్రపంచకప్‌లో యువ భారత్ మరోపోరుకు సిద్ధమైంది. ఇప్పటికే బంగ్లాదేశ్‌పై భారీ విజయం సాధించి జోరు మీదున్న భారత్..గురువారం ఐర్లాండ్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచి అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకునేందుకు పావులు కదుపుతున్నది. బంగ్లాతో మ్యాచ్‌లో కెప్టెన్ ఉదయ్ సహరాన్, ఆదర్శ్‌సింగ్ అదరగొట్టగా, సహచర బ్యాటర్లు స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోయారు. బౌలింగ్‌లో సౌమీకుమార్, ముషీర్‌ఖాన్ రాణిస్తున్నారు.

# బజ్‌బాల్ X స్పిన్‌బాల్

## ఉప్పల్‌లో నేటి నుంచి భారత్, ఇంగ్లండ్ తొలి టెస్టు

**ఢీ అంటే ఢీ అంటున్న ఇరు జట్లు ● ఐదేండ్ల తర్వాత హైదరాబాద్‌లో టెస్టు**

భారత్, ఇంగ్లండ్ టెస్టు పోరుకు రంగం సిద్ధమైంది. ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియం వేదికగా గురువారం నుంచి ఇరు జట్లు ఢీ అంటే ఢీ అన్నట్లు తలపడబోతున్నాయి. ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో హైదరాబాద్ తొలి పోరుకు ఆతిథ్యమిస్తున్నది. ఐదేండ్ల తర్వాత నగరంలో జరుగుతున్న టెస్టు మ్యాచ్ కోసం అభిమానులు ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. ఇంగ్లండ్ తమ బజ్‌బాల్ వ్యూహాన్ని నమ్ముకుంటే భారత్ స్పిన్‌బాల్ సవాల్‌కు సై అంటున్నది. స్వదేశంలో కొట్టిన పిండిలాంటి పిచ్‌లపై ఇంగ్లండ్ బ్యాటర్లను ముచ్చెమటలు పట్టించేందుకు రోహిత్‌సేన తహతహలాడుతుంటే..బజ్‌బాల్‌తో దీటుగా స్పందించేందుకు ఇంగ్లిష్ సైన్యం సమాయత్తమవుతున్నది. మొత్తంగా రెండు అత్యుత్తమ జట్ల మధ్య పోరు అభిమానులకు పసందైన విందు అందించడం ఖాయంగా కనిపిస్తున్నది.



స్టోక్స్







హైదరాబాద్, ఆట ప్రతినిధి: స్వదేశంలో భారత్ టెస్టుల్లో అప్రతిహత విజయాలతో దూసుకెళుతున్నది. గత పుష్కర కాలంగా ప్రత్యర్థికి సిరీస్ కోల్పోని టీమ్‌ఇండియా..అదే పంథాను కొనసాగించేందుకు పట్టుదలతో ఉంది. ఉప్పల్ స్టేడియం వేదికగా గురువారం నుంచి ఇరు జట్ల మధ్య మొదటి టెస్టు మ్యాచ్‌కు తెరలేవనుంది. దక్షిణాఫ్రికాపై టెస్టు సిరీస్ సమంతో ఆత్మవిశ్వాసంతో ఉన్న టీమ్‌ఇండియా అదే ఊపులో ఇంగ్లండ్ భరతం పట్టాలని చూస్తున్నది. బజ్‌బాల్‌కు దీటుగా స్పిన్ వ్యూహాన్ని రచించేందుకు చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్, కెప్టెన్ రోహిత్‌శర్మ పక్కా ప్రణాళికతో ఉన్నారు. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో ప్రతీ మ్యాచ్ కీలకమైన నేపథ్యంలో భారత్, ఇంగ్లండ్ గెలుపు కోసం కడదాకా ప్రయత్నించే అవకాశముంది. బలబలాల పరంగా రెండు జట్లు సమవుజ్జీలుగా కనిపిస్తున్నా..సొంతగడ్డపై ఆడటం భారత్‌కు అదనపు బలం కానుంది.

**1** 2011 తర్వాత కోహ్లీ, పుజార, రహానే లేకుండా భారత్ టెస్టు ఆడటం ఇదే తొలిసారి.

**10** టెస్టుల్లో ఐదు వందల వికెట్ల మైలురాయిని అందుకోవడానికి అశ్విన్‌కు కావాల్సిన వికెట్లు

### స్పిన్ సవాల్

సరిగ్గా 12 ఏండ్ల క్రితం ఇదే ఇంగ్లండ్ చేతిలో ఓటమిపాలైన భారత్..మళ్లీ వెనుదిరిగి చూసుకోలేదు. ఇన్నేండ్లలో ఆడిన 44 టెస్టుల్లో కేవలం మూడంటే మూడు మ్యాచ్‌ల్లోనే టీమ్‌ఇండియా ఓడింది. అంటే ఇక్కడే అర్థం చేసుకోవచ్చు భారత్ ఆధిపత్యం ఎలా కొనసాగిస్తుందో. ముఖ్యంగా సంప్రదాయ స్పిన్‌ను నమ్ముకున్న టీమ్‌ఇండియా అనుకున్న ఫలితాన్ని సాధిస్తున్నది. ఇందులో స్పిన్ ద్వయం అశ్విన్, జడేజాది కీలక భూమిక. స్వదేశంలో ఎక్కడా మ్యాచ్ జరిగినా..వీరిద్దరు తమ స్పిన్ తంత్రంతో ప్రత్యర్థిని పడగొట్టడంలో సిద్ధహస్తులు. 2012 నుంచి ఇప్పటి వరకు అశ్విన్ 19 సగటుతో 46 టెస్టుల్లో ఏకంగా 283 వికెట్లు నేలకూల్చాడు. మరోవైపు తానేం తక్కువ కాదన్నట్లు జడేజా 39 టెస్టుల్లో 191 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. వీరిద్దరికి కుల్దీప్‌యాదవ్, అక్షర్ పటేల్‌లో ఒకరు జతకలిస్తే..ప్రత్యర్థి తోక ముడువడం ఖాయం. మొదటి రోజు నుంచే స్పిన్ తిరిగే అవకాశం కనిపిస్తున్న ఉప్పల్ పిచ్‌పై భారత స్పిన్ త్రయం ఇంగ్లండ్ బ్యాటర్లకు మూకుతాడు వేయడం ఖాయంగా కనిపిస్తున్నది. కోహ్లీ గైర్హాజరీలో యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, రాహుల్, శ్రేయాస్ అయ్యర్ సత్తాచాటేందుకు తహతహలాడుతున్నారు. బుమ్రా, సిరాజ్ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు.

### బజ్‌బాల్

సంప్రదాయ టెస్టు క్రికెట్‌కు బజ్‌బాల్ కొత్త రూపురేఖలు తీసుకొచ్చింది. అప్పటి వరకు నింపాదిగా సాగిన టెస్టు క్రికెట్‌ను టాప్‌గేర్‌లోకి తీసుకెళ్లింది. ఇంగ్లండ్ చీఫ్ కోచ్ బ్రెండన్ మెకల్లమ్ అమ్ములపొదిలో నుంచి వచ్చిన బజ్‌బాల్ టెస్టు క్రికెట్‌లో ఒక విప్లవాన్ని తీసుకొచ్చింది. తొలుత బ్యాటింగ్ చేస్తే..వన్డే, టీ20 తరహాలో దూకుడుగా బ్యాటింగ్ చేయడం ఆ వెంటనే మారు ఆలోచించకుండా ఇన్నింగ్స్ డిక్లేర్ చేయడం. బౌలింగ్ చేస్తే..ప్రత్యర్థిని స్వల్ప స్కోరుకు కట్టడి చేయడం బజ్‌బాల్ లక్ష్యం. అయితే విదేశాల్లో బజ్‌బాల్ పాచిక పారినా..భారత్‌లో అమలయ్యే అవకాశం కనిపించడం లేదు. గతానికి భిన్నంగా ఇంగ్లండ్ ఈసారి ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగుతున్నది. ఒక రకంగా స్పిన్‌ను స్పిన్‌తోనే కొట్టాలనే లక్ష్యంతో ఇంగ్లండ్ కనిపిస్తున్నది. దీంతో ఇరు జట్ల మధ్య రసవత్తర పోరు జరిగే అవకాశముంది.

**జట్ల అంచనా**

**భారత్:** రోహిత్(కెప్టెన్), జైస్వాల్, గిల్, శ్రేయాస్ అయ్యర్, రాహుల్, జడేజా, భరత్, అక్షర్‌పటేల్, అశ్విన్, బుమ్రా, సిరాజ్

**ఇంగ్లండ్:** స్టోక్స్(కెప్టెన్), క్రాలె, డకెట్, పోప్, రూట్, బెయిర్‌స్టో, ఫోక్స్, రేహాన్ అహ్మద్, మార్క్ వుడ్, హార్ట్లె, లీచ్.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.